ప్రజాశక్తి
బుధవారం 21 జూన్ 2023 8 పేజీలు




ప్రకాశం బాపట్ల

'గడప గడపకూ'పై

నేడు సిఎం జగన్ సమీక్ష

- ముందస్తు ఎన్నికలపై ఉత్కంఠ
- టికెట్ల కోసం ఆశావహుల ప్రయత్నాలు



ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ అమలుపై వైసిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డి నేడు సమీక్ష చేయనున్నారు. ఈ సమావేశంలో వైసిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు పాల్గొననున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ దక్కించుకోవాలంటే ముందుగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అమలు పరీక్షలో ఉత్తీర్ణులవ్వాల్సిందేనని పార్టీ అధినేత పలుమార్లు స్పష్టం చేశారు. దీంతో టిక్కెట్ ఆశిస్తున్న అభ్యర్థులు ఈ పరీక్షలో ఉత్తీర్ణత కోసం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ 4 సార్లు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంపై సమీక్షా సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో జగన్ మోహన్‌రెడ్డి దిశానిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించిన వారిని హెచ్చరించారు. దీంతో ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీరియస్ తీసుకున్నారు. ఎన్నికల్లో పోటీకి గడప గడపకూ కార్యక్రమానికి సంబంధం లేకపోయినా పార్టీ అధినేత మాట కాదనలేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలోని గడప గడపకూ కార్యక్రమాన్ని పూర్తి చేస్తే రూ.20 లక్షలు నిధులు మంజూరవుతాయి. గతంలో బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న రావి రామనాథం బాబు రాష్టంలోనే గడప గడప కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అయినప్పటికీ ఆయన్ని ఇన్‌ఛార్జి పదవి నుంచి తొలగించి చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు గడప గడపకూ కార్యక్రమాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. గత ఫిబ్రవరిలో నిర్వహించిన సమీక్షలో సిఎం జగన్ గడప గడపకూ కార్యక్రమం గురించి అందరికీ నచ్చజెప్పే రీతిలోనే మాట్లాడారు. సక్రమంగా తిరగని వారిని హెచ్చరించలేదు. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులు ఎవరైతే గెలుపు అవకాశాలు ఉంటాయి వారి బలాలు, బలహీనతలపై సర్వే చేస్తున్న ఐప్యాక్ టీమ్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు సంబంధించిన సమగ్ర నివేదికలు పర్టీ అధినేత ముందు ఉంచినట్లు తెలుస్తుంది. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు గృహాల సందర్శన సందర్భంగా ప్రజలు నుంచి వస్తున్న అనుకూలత, వ్యతిరేక అంశాల గురించి నిగూఢ సర్వే నిర్వహించారు. ఆ సర్వే ఆధారంగా గ్రేడ్‌లు ఇస్తూ పార్టీ అభ్యర్థులుగా ఎవరైతే మంచి ఫలితం ఉంటుందనే విషయంపై కసరత్తులు చేస్తున్నారు.

ఐప్యాక్ టీమ్ సర్వే ఆధారంగా టిక్కెట్

గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటే ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల రాజకీయ భవిష్యత్ తేలిపోతుంది. క్రొందరు నేతల రిపోర్టులు వారికి వ్యతిరేకంగా వస్తున్నట్లు సమాచారం. కొందరు నేతలు తక్కువగా తిరిగినా వారికి నియోజకవర్గం నుంచి మద్దతు లభిస్తుంది. మొత్తంగా ఐప్యాక్ సర్వేల ఆధారంగా పార్టీ అధినేత జగన్ తమ అభ్యర్థుల ఖరారు చేసే అవకాశం ఉంది.

నూతన ఆర్థిక విధానాలతో దళితులకు నష్టం

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన భవిష్యత్ గ్యారెంటీ ప్రచార బస్సు యాత్రను జయప్రదం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సు యాత్ర ఈనెల 25న యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్ద దోర్నాల మండలం చిన్నగుడిపాడు గ్రామానికి రానున్నట్లు తెలిపారు. తొలుత వైసిపి రాళ్లదాడిలో తీవ్ర గాయాలపాలై మృతి చెందిన గుడిపాడు గ్రామానికి చెందిన చేదూరి రాజయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. బాధిత కుటుంబానికి రూ. 10 లక్షలు చెక్కును అందజేసారని తెలిపారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబటి వీరారెడ్డి, భట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, వల్లభనేని కాశయ్య, జెడి లక్ష్మయ్య, దొడ్డా శేషాద్రి, ఇస్మాయిల్, గుండారెడ్డి వెంగళరెడ్డి, గుండారెడ్డి విషువర్ధన్‌రెడ్డి, నాగేంద్రబాబు, శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రకాశం-దర్శి

స్థానిక పొదిలి రోడ్‌లోని గాంధీనగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు, ఓ చిన్నారికిఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ఒక్కొకరికి రూ. 10 వేల వంతున ఆర్థిక సాయం అందజేశారు. దర్శి-4 సచివాలయ పరిధిలోని 7వ వార్డులో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. డాక్టర్ కిరణ్మయితో మాట్లాడి వైద్యశాలలో రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవుల జ్యోతి, విసిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ వైవి.సుబ్బయ్య, వైసిపి మండల కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్రకార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నాయకులు రమణారెడ్డి, శివారెడ్డి, అచ్చయ్య, వెంకటేశ్వరరెడ్డి, చెన్నారెడ్డి, యర్రయ్య., వైసిపి నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు రెండో రోజూ మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 'నూతన ఆర్థిక విధానాలు-దళితులు' అనే అంశాన్ని ప్రజా సంఘాల నాయకులు వి.రాంభూపాల్ బోధించారు. నూతన ఆర్థిక విధానాలు 1991 నుంచి దేశంలో అమల్లోకి వచ్చాయని తెలిపారు. ఈ విధానాలు అమల్లోకి వస్తే దేశం అన్నీ రంగాల్లో పురోభివృద్ధి చెందుతుందని, దారిద్ర్యం, నిరుద్యోగం పోతుందని, పారిశ్రామిక అభివృద్ధి జరిగి, ఎగుమతులు పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పాలకులు గొప్పలు చెప్పారని గుర్తు చేశారు. ఆచరణలో పెట్టుబడి దారులకు అనుకూలంగా అన్నీ రంగాలను ప్రయివేటు పరం చేస్తున్నారని వివరించారు. దీని వల్ల సామాజికంగా అట్టడుగు వర్గాలకు చెందిన దళితులు కుల వివక్షకు గ ం ర వు త ం న్నా ర ని పేర్కొన్నారు. నూతన ఆర్థిక విధానాలు దళిత, గిరిజనులకు తీవ్ర నష్టం తెచ్చాయని చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటు పరం చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గి నిరుద్యోగాన్ని పెంచడమే కాకుండా డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లు సైతం అమలు కావడం లేదని వివరించారు. ఒకవైపు ప్రయివేటు రంగం పెరుగుతున్నప్పటికీ అందులో రిజర్వేషన్లు అమలు చేయడం లేదన్నారు. మౌళిక సదుపాయాలలైన విద్య, వైద్యం ప్రయివేటు పరం కావడం వల్ల దళితులు, గిరిజనులు, సామాజిక తరగతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తూ సహజ వనరులన్నీ కార్పొరేట్ శక్తులకు అప్పజెపుతున్నారని తెలిపారు. భూమిలేని నిరుపేదలలో 86శాతం దళితులు ఉన్నారన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయినా దళితుల అక్షరాస్యత శాతం జాతీయ సగటుకంటే దిగువ స్థాయిలో ఉందన్నారు. దళిత మహిళల్లో అక్షరాస్యత శాతం 54శాతానికి మించి లేదన్నారు. సామాజిక న్యాయానికీ దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కులవివక్షత, అంటరాని తనం కొనసాగుతుందన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం మతోన్మాద, ఉన్మాదంతో ప్రజల ఐక్యత మధ్య చిచ్చుపెట్టి ప్రజలను చీల్చే కుట్రలు చేస్తుందన్నారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని గుర్తించకుండా మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తెస్తుందన్నారు. అన్నీ వ్యవస్థలలో ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను చొప్పించి అమలుకు వత్తిడి తెస్తుందన్నారు. మధ్యాహ్నం క్లాస్‌ను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి లోక్‌నాథం బోధించారు.ప్రిన్సిపల్‌గా ఎమ్‌డి ఆనంద్‌బాబు వ్యవ హరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఓ. నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. రఘురాం, నటరాజ్, రంగమ్మ, తిరుపాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.రాంభూపాల్

మృతుడి బంధువుల ధర్నా

దర్శి : మండల పరిధిలోని బండివెలిగండ్ల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోతిపోగు కోటేష్ కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక గడియారస్తంభం సెంటర్ మృతుడి బంధువులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన లారీ యజమాని ద్వారా ఆర్థిక సాయాన్ని అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ధర్నా గురించి తెలుసుకున్న సిఐ రామకోటయ్య, ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని లారీ జయజమానితో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో మృతుడి బంధువులు ధర్నా విరమించారు.

విత్తనాలు పంపిణీ

రాచర్ల : మండల పరిధిలోని ఆకవీడు గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా రైతులకు కొర్ర విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్, రాచర్ల ఎఒ షేక్ అబ్దుల్ రఫీక్, ఆకవీడు రైతు భరోసా కేంద్రం విహెచ్ఎ వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

చీరాలలో బిజెపి కార్యకర్తల అత్యుత్సాహం

అంబేద్కర్ విగ్రహం చుట్టూ బిజెపి జెండాలు ● బిజెపి చర్యలను ఖండించిన దళిత సంఘాలు

ప్రజాశక్తి-చీరాల

బిజెపి కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. దళితులందరూ ఆరాధ్య దైవంగా భావించే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ బిజెపి జెండాలను కట్టి హడావిడి చేశారు. పరిస్థితి గమనించి వెంటనే స్పందించిన దళిత సంఘాలు దీనిని ఖండించడంతో విషయం తెలుసుకొని స్వయంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు వచ్చి కమలం జెండాలను తీసివేశారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా చీరాలలోని ముక్కోమణపు పార్క్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం జరిగింది. వివరాల ప్రకారం.. బిజెపి నాయకులు చీరాల గడియార స్తంభం సెంటర్లో మంగళవారం సాయంత్రం బహిరంగ సభను ఏర్పాటు చేసుకున్నారు. అయితే సభకు సంబంధించిన కమలం జెండాలను చీరాల పట్టణం అంతటా కార్యకర్తలు కట్టారు. ఈ నేపథ్యంలో పార్టీ జెండాలను ఎక్కడ కట్టాలో ఎక్కడ కట్టకూడదో కూడా కనీస అవగాహన లేని బిజెపి కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఏకంగా అంబేద్కర్ విగ్రహం



అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన బిజెపి జెండాలు

చుట్టూ జెండాలను కట్టేశారు. అంతేకాకుండా పట్టణంలోని ఓ ప్రార్ధనా మందిరం వద్ద కూడా కమలం జెండాలను కట్టారు. విషయం గమనించిన దళిత సంఘాలు, ప్రజా సంఘాలు వెంటనే దీనిని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి సోషల్ మీడియా వేదికగా బిజెపి విధానాన్ని ప్రశ్నిస్తూ తక్షణమే జండాలు తొలగించాలని, లేకుంటే దళిత నాయకులు ఏకమై నిరసన కార్యక్రమాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న బిజెపి జిల్లా అధ్యక్షులు మువ్వల వెంకటరమణారావు స్వయంగా వచ్చి తమ కార్యకర్తలు చేసిన పని తప్పేనని క్షమాపణ చెబుతూ అంబేద్కర్ విగ్రహం చట్టూ ఉన్న బిజెపి జెండాలను స్వయంగా ఆయనే తొలగించారు. అయితే సమాచారం అందుకున్న పోలీసులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంబేద్కర్ విగ్రహ వద్ద జెండాలు తొలగించే వరకు పికెటింగ్ నిర్వహించి పరిస్థితిని సద్దుమణిగించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు కంచర్ల చిట్టిబాబు, గోసాల సుధాకర్, బజ్జి బాబు పలువురు మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలు చేసిన నిర్వాకానికి జిల్లా అధ్యక్షులు వచ్చి జెండాలు తొలగించడంతో నిరసన విరమిస్తున్నామని, అయితే అంబేద్కర్ విగ్రహం వద్ద ఏ పార్టీ నాయకులు అయినా జెండాలు కట్టినట్లయితే వారిపైన పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దళిత సంఘాల అన్ని ఏకమై నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మహిళలకు జీవనోపాధి విస్తరణపై అవగాహన

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

పిట్టలవానిపాలెంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి జీవనోపాధుల విస్తరణపై మండల స్థాయి అధికారులు విఓఏలు, బ్యాంకు మేనేజర్లతో ఏపిఎం సంతోష్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఎంపీపి బాజీ మాట్లాడుతూ నేడు వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో సామాజిక, సాంకేతిక, రాజకీయ, ఆర్థిక తదితర అన్ని రంగాలలో ముందుంటున్న మహిళలను ఉత్తేజపరచి నేటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సంఘటీకృతం చేసి మహిళలను వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడం నేటి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ పథకాలు ఇచ్చినా ఆర్థిక సహకారంలో ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషమాంబ, ఈఓపిఆర్డి పద్మజ, విఓఏలు పాల్గొన్నారు.

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి నిరసన సెగ

ప్రజాశక్తి-చీరాల



బిజెపి బహిరంగ సభలో నిరసన తెలియజేస్తున్న సాధన సమితి నాయకులు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు చీరాలలో నిరసన సెగ తగిలింది. బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం చీరాల గడియార స్తంభం సెంటర్లో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభలో ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదా సంగతి ఏంటి మన విశాఖ ఉక్కు పరిస్థితి ఏంటి? మన రైల్వే జోన్ విషయం ఏంటి? ఇంతకు తెలుగువారి గంతీ ఏంటి? అంటూ అదేవిధంగా తెలుగుదేశం పార్టీతో మట్టి వరకు, వైసిపితో ఇప్పటివరకు, దేనినైనా ఎవరినైనా ప్రశ్నిస్తానన్న జనసేనతో కలిసి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు లేకుండా చేశారని, వీటిపై రాష్ట్ర అధ్యక్షులుగా మీ అభిప్రాయాన్ని చీరాల సాక్షిగా రాష్ట్రానికి తెలియజేయాలని అంటూ నియోజకవర్గ సాధన సమితి నాయకులు శాంతియుతంగా ఫ్లెక్సీతో సభా ప్రాంగణంలో ఓ వైపు నిరసన కార్యక్రమం చేపట్టారు. విషయం గమనించిన పోలీసులు ఫ్లెక్సీలను లాక్కొని నిరసనకారులను ఆ ప్రాంతం నుంచి పంపించారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు శీలం రవికుమార్, సయ్యద్ బాబు, ఎస్కే జిలాని, భగత్ సింగ్, తేళ్ళ రవికుమార్ పలువురు మాట్లాడుతూ బహిరంగ సభను ఏర్పాటు చేసి ప్రజలకు మోసపూరిత మాటల చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తూ, పెట్రోలు గ్యాస్ ధరలను అమాంతం పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరగగొడుతున్న బిజెపికి బహిరంగ సభలు నిర్వహించి ప్రజా సంక్షేమాల గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. ఏదేమైనాప్పటికీ సాధన సమితి నాయకులు శాంతియుతంగా నిరసన చేపడుతూ అడిగిన ప్రశ్నలకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు సమాధానం ఇవ్వలేకపోయారని స్థానికులు చర్చించుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సభ ముగిసింది.

వికలాంగులమన్న భావన రాకూడదన్నదే సిఎం తపన

ప్రజాశక్తి-టంగుటూరు

తాము వికలాంగులమని, ఏ పనీ చేయలేకపోతున్నామన్న భావన వారిలో కలగకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో తపనతో వారికి మూడు చక్రాల మోటార్ సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు గురిజాల అర్చన అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో వికలాంగులకు మంజూరైన మూడు చక్రాల మోటార్ సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. నియోజకవర్గ స్థాయిలో పదిమందికి రూ.12 లక్షలు వెచ్చించి మూడు చక్రాల మోటార్ సైకిళ్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులైన వికలాంగులు ఉంటే వారికి కూడా మోటార్ సైకిళ్లను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు చింతపల్లి హరిబాబు, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, తహశీల్దారు కొల్లిబోయిన సంజీవరావు, ఎంపీడీఓ పి రత్నజ్యోతి, ఏపీఓ ఎం సుభాషిణి, వైసీపీ సీనియర్ నాయకులు బీనీడి ఉదయ్ కుమార్, ఆనం సత్యనారాయణరెడ్డి, గుండపురెడ్డి శ్రీహరి రెడ్డి, తక్కెళ్లపాటి సుధాకర్, చక్కా రాజేశ్వరరావు, నల్లూరి సురేంద్ర, టి సుబ్బారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు

జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ చేయూత

ప్రజాశక్తి-అర్ధవీడు

మండల కేంద్రం చీమలేటిపల్లి గ్రామంలో 12వ తేదీ సోమవారం రాత్రి 7గంటల 30 నిమిషాల సమయంలో 15 చెంచుగుడిసెలు కాలిపోయాయి. ఈ విషయాన్ని జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ఆఫీస్ వారికి నాగుల రాజు తెలియజేయగా జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ రెవ డాక్టర్ గుర్రం శేఖర్ చీమలేటిపల్లి గ్రామాన్ని దర్శించారు. చెంచుగూడెంలోని గిరిజనులు సమస్తాన్ని కోల్పోయి కట్టుబట్టలతో ఉండిపోయారు. వెంటనే ఈ విషయమై జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ రెవ డాక్టర్ గుర్రం శేఖర్ స్పందించి వారికి ఒక్కొక్క కుటుంబానికి 18 రకాల వంట సామాన్లు, 25 కేజీల బియ్యం, నెలకు సరిపడా సరుకులు, కూరగాయలు, ఒక్కొక్కరికి రెండు దుప్పట్లు, ఒక చాప, దిండు, పురుషులకు, స్త్రీలకు, ఆడపిల్లలకు, మగ పిల్లలకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ రెవ డాక్టర్ గుర్రం శేఖర్ రూ.2.80 లక్షల ఖరీదైన సామగ్రిని ఇళ్లు కాలిపోయిన పేదలకు అర్ధవీడు మండల ఇన్‌ఛార్జి తహశీల్దారు ఎల్ వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి ఎంపిడిఓ పి సాంబశివరావు, గ్రామ సర్పంచి పి వసంత చేతుల మీదుగా పంపిణీ చేశారు. తహశీల్దారు, గ్రామ సర్పంచ్ జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ అసిస్టెంట్ డి ఖాదర్ వలి, పంచాయతీ సెక్రటరీ పి రామకృష్ణారావు, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ అన్వేష్, విఆర్ఓ ఎస్‌డి మదార్‌వలి, జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ట్రెజరర్ బెన్ని సునీతారూత్, సొసైటీ కో-ఆర్డినేటర్ విజయ్ కుమార్, సూపర్‌వైజర్లు రామ్ సింగ్ నాయక్, భూతపాటి సాల్మన్, సింగా ఏసన్న, బుట్టి దిలీప్ కుమార్, కొండెపోగు ప్రసన్న కుమార్, ఫీల్డ్ వర్కర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలోని మొగుళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నేరెళ్ల హరికృష్ణ, ఆవుల వెంకట ప్రహ్లాదరెడ్డిలు పదో తరగతి పరీక్షల్లో 586 మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.7వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేల నగదును మండలంలోని జార్జి ఫౌండేషన్ అధినేత దేవసహాయం, నరసింహాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతపూడి దేవసహాయం ఆర్థిక సాయంతో బహుమతులను ప్రదానం చేశారు. అదే విధంగా మండలంలోని వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో



దేవసహాయాన్ని సన్మానిస్తున్న దృశ్యం

నిలిచిన వారికి రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.2 వేలు నగదు అందజేశారు. దీంతో జార్జి ఫౌండేషన్ అధినేత దేవసహాయాన్ని జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగూర్‌యాదవ్, మండల వైసిపి కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, పి నారాయణ, ఎంపిడివో తాతపూడి సుకుమార్, ఎంఇఓ దాస్‌ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రాజాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు షేక్ ఖాదర్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-మార్కాపురం

ట్రైనీ ఐపిఎస్, మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సురానా అంకిత ఆధ్వర్యంలో పేకాట శిబిరాలపై దాడులు కొనసాగుతున్నాయి. మార్కాపురం మండలంలోని నికరంపల్లి గ్రామ సమీపంలో గల పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం దాడి చేశారు. 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు మోటార్ బైక్‌లతో పాటు రూ.42,200 నగదును స్వాధీనం చేసుకున్నారు.

మాజీ సర్పంచికి నివాళి

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఇడమకల్లు మాజీ గ్రామ సర్పంచ్ ఖాసింపీరా భౌతికకాయానికి గిద్దలూరు వైసిపి నేత పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి పూలమాలవేసి సోమవారం నివాళి అర్పించారు. రోడ్డు ప్రమాదంలో ఖాసింపీరా ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. తర్వాత వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, రంగారెడ్డి, రామకోటయ్య, బాషా, వెంకటేష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పంట సాగుదారుల హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

పిట్టలవానిపాలెం మండలం కోమలి, భవనంవారిపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సమిష్టిగా సాగుదారులకు పంట సాగు హక్కు పత్రం (సిసిఆర్‌సి)పై మంగళవారం అవగాహన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి బి శేషమాంబ పాల్గొని రైతులకు ఏ విధంగా ఈ పంట సాగు పత్రం ఉపయోగపడుతుందో తెలియజేశారు.

సిసిఆర్‌సి కార్డు తీసుకోవటానికి కావలసిన పత్రాలు

ఈ కార్డు పొందాలంటే పొలం యజమాని పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, సాగుదారుడి ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, అప్లికేషన్ ఫామ్ నింపి గ్రామ రెవెన్యూ అధికారిని లేదా గ్రామ వ్యవసాయ సహాయకులను గాని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవనం వారిపాలెం గ్రామ సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు ఏ వీరనాయుడు, సర్వోత్తమరావు, వ్యవసాయ విస్తరణ అధికారి సుదర్శన్‌రావు, శేషమ్మ, పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాసరావు, వసుంధర లక్ష్మి, పిఎసిఎస్ కోమలి, పర్సనల్ ఇన్‌ఛార్జి వీరారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసాదు, విజయదుర్గ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యలో సాధికారత సాధించే దిశగా నూతన విద్యా విధానం-2020 అమలులో భాగంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి 2023-24 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని ప్రవేశపెట్టినట్లు శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం సూచనలు అనుసరిస్తూ స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో నూతన విద్యా విధానంలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం, డిగ్రీ ఆనర్స్ కోర్సులు, మైనర్, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టులు, స్కిల్ ఎన్హాన్స్ సబ్జెక్టులు, ఇంటర్న్‌షిప్స్, ప్రాజెక్టు వర్క్స్, క్రెడిట్ పాయింట్స్ విధానం మొదలైనవి సమగ్రంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సైన్స్ విద్యార్థులు మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టుగా ఆర్ట్స్, అలాగే ఆర్ట్స్ విద్యార్థులు మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టుగా సైన్స్ చదవాల్సిన విధానం, ఆపై మధ్యలో చదువు ముగించే వారికి సర్టిఫికెట్, డిప్లమో, డిగ్రీ పట్టాలు పొందే అవకాశం, ఆనర్స్‌తో నేరుగా పరిశోధనా రంగంలోకి వెళ్లే అవకాశాలు పూర్తి స్థాయిలో విద్యార్థులకు, సిబ్బందికి వివరించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ విభాగం ఆధ్వర్యంలో కె పవన్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపల్ పి శ్రీధర్‌కుమార్ కోర్సు విధి విధానాలను వివరించారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

- ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి వెంటనే విచారణ జరపాలి
- అమర్నాథ్ కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాలా ఆదుకోవాలి
- మహిళలు, బడుగు బహీనవర్గాలపై అత్యాచారాలు, దాడులను వెంటనే అరికట్టాలి

ప్రజాశక్తి-బాపట్ల

చెరుకుపల్లి అమర్నాథ్ హత్య ఘటనకు నిరసనగా ఈ నెల 24న బాపట్లలో జరిగే నిరసన ప్రదర్శనకు ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొనాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం బాపట్ల పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో గంగయ్య అధ్యక్షతన జరిగిన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఆయన మాట్లాడారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్న సమావేశంలో గంగయ్య మాట్లాడారు. అమర్నాథ్ హంతకులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ హత్యలో పాల్గొన్న నలుగురు నిందితుల్లో కేవలం ముగ్గురిని మాత్రమే అరెస్ట్ చేయడంపట్ల సమావేశం తీవ్రంగా ప్రతిఘటించింది. హత్యకు ప్రాణాళిక రచించిన నాలుగో వ్యక్తిని అరెస్టు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. అమర్నాథ్ హంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఈ నెల 24న బాపట్లలో జరిగే నిరసన కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల విద్యార్థులు, బాపట్ల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి ప్రొఫెసర్ సాయిబాబు, అడ్వకేట్ భాస్కర్ గౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం వేణు, బీఎస్పీ నాయకులు విజయరాజు, అంబేద్కర్ సంఘం నాయకులు జి రాజారావు, బీసీ సంఘం నాయకులు గోపీనాథ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, మహిళా సంఘం (ఐద్వా) నాయకులు సుభాషిణి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ మజుందార్, సిహెచ్ మణిలాల్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వై భాస్కరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్య, మనోజ్, నాయకులు నాగలక్ష్మి, భాను, కెవిపిఎస్ జిల్లా నాయకులు శరత్, ఆటో యూనియన్ నాయకులు వై శ్రీనివాసరావు, దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య



నేడు ఆవిష్కరించనున్న లాజర్ స్మారక స్థూపం

నేడు కామ్రేడ్ లాజర్ స్థూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పెదపులివర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెంలో బుధవారం కామ్రేడ్ గొర్రుముచ్చు లాజర్ సంస్మరణ సభ జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి జి సుధాకర్ తెలిపారు. సంస్మరణను పురస్కరించుకొని గ్రామంలో నిర్మించిన లాజర్ స్థూపాన్ని కూడా సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవిష్క రిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, బాపట్ల, గుంటూరు జిల్లాల పార్టీ కార్యదరులు సిహెచ్ గంగయ్య, పాశం రామారావు, ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు తదితర జిల్లా, మండల నాయకులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ సంస్మరణ సభలో అందరూ పాల్గొనాలని కోరారు.

ఎస్‌బిఐ మేనేజర్‌గా యడవల్లి లెనిన్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్టూరు బ్రాంచ్ మేనేజర్‌గా యడవల్లి లెనిన్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదా వరి జిల్లా భీమవరం ఎస్‌బిఐ బ్రాంచి స్కేల్-3 మేనేజర్‌గా విధులు నిర్వహించిన లెనిన్‌బాబు సాధారణ బదిలీల్లో భాగంగా మార్టూరు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట రుణాలు సకాలంలో చెల్లించండి

మార్టూరు స్టేట్ బ్యాంకు ద్వారా క్రాప్‌లోన్ తీసుకొని మూడు సంవత్సరాలు గడిచి నేటికీ చెల్లించని ఖాతాదారులు 200 మంది ఉన్నారని, వారంతా పంట రుణాలు సకాలంలో చెల్లించి తమ లోను ఖాతాలను రెన్యువల్ చేయించుకోవాలని మేనేజర్ కోరారు.

నేడు ఎన్ఆర్ఇజిఎస్ పబ్లిక్ హియరింగ్

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై బుధవారం సామాజిక తనిఖీపై పబ్లిక్ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరుగుతుందని ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సామాజిక బృందం ఆయా గ్రామాలలో పర్యటించి జరిగిన పనులను పరిశీలించారు. మండలంలో ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు పాల్గొనాలని సూచించారు.

29న బక్రీద్

గవర్నమెంట్ ఖాజీ సయ్యద్ తయ్యబ్ అహమ్మద్

ప్రజాశక్తి-రేపల్లె



ఈ నెల 29వ తేదీన బక్రీద్ పండుగను ముస్లిములు జరుపు కోవాలని గవర్నమెంట్ ఖాజీ సయ్యద్ తయ్యబ్ అహమ్మద్ ప్రకటించారు. 2023 సంవత్సరం జుల్ హిజ్జా నెలవంక సోమవారం కనిపించడంతో ఈ నెల 29న దేశవ్యాప్తంగా ముస్లింలు పవిత్ర బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారని వివరించారు. ఆరోజు అల్లాహ్ ప్రసన్నత కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని ఆయన తెలిపారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

అమర్నాథ్ హత్య కేసులో నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఉప్పాల అమర్నాథ్ హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉప్పాలవారిపాలెం గ్రామంలో అమర్నాథ్ కుటుంబ సభ్యులను ఆమె కలిసి పరామర్శించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని జస్టిస్ వర్మ కమిటీ సిఫార్సుల మేరకు నిందితులను 45 రోజులలో విచారణ చేయించి కఠినంగా శిక్ష విధించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు శ్రీనివాస్ కుమారి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పీ మనోజ్ కుమార్, సిఐటియు చెరుకుపల్లి మండల కార్యదర్శి కే శరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

ఐద్వా ఆధ్వర్యంలో గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పలు పాఠశాలలో కళాశాలలో విద్యార్థులకు నేటి సమాజంలో విద్యార్థులకు ఎదురవుతున్న అనుభవాలు, నేటి సమాజంలో ఎదురవుతున్న విష సంస్కృతి, యువతపై వాటి ప్రభావం, సెల్ ఫోన్ల వాడకం, యువతపై తల్లిదండ్రుల ప్రభావం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఐద్వా నాయకురాలు ఆదిలక్ష్మికి మాతృవియోగం

ప్రజాశక్తి-పిసిపల్లి

ఒంగోలు నగర ఐద్వా కార్యదర్శి జి ఆదిలక్ష్మి తల్లి కరణం వరమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. సోమవారం గుంటూరులోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బుధవారం మండలంలోని వెంగళాయపల్లిలో మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వరమ్మకు భర్త చంద్రయ్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో 2వ కుమార్తె ఒంగోలు నగర ఐద్వా కార్యదర్శిగా, ఆదిలక్ష్మి భర్త జి రమేష్ ఒంగోలు నగరం సిపిఎం కార్యదర్శిగా పని చేస్తున్నారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి కె రమాదేవి, జిల్లా కమిటీ సభ్యురాలు కె రాజేశ్వరి, సిఐటియు నాయకులు వెంకటరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు, పిసిపల్లి మండల నాయకులు బడుగు జనార్ధన్, ప్రజాశక్తి సర్క్యులేషన్ జిల్లా ఇన్‌చార్జి ఎ బ్రహ్మయ్య పాల్గొన్నారు.



కరణం వరమ్మకు నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా నాయకులు జివి కొండారెడ్డి, జి రమేష్ తదితరులు

విఆర్ఎల సంఘం బాపట్ల జిల్లా నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-బాపట్ల



రత్నబాబు



షేక్ కరీముల్లా

వీఆర్ఏల సంఘం బాపట్ల జిల్లా నూతన అధ్యక్షులుగా రత్నబాబు (నిజాంపట్నం) కార్యదర్శిగా షేక్ కరీముల్లా (యద్దనపూడి) ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా మంజుందార్, జిల్లా ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శిగా మౌలాబి, కోశాధికారిగా హనుమంతరావు, జిల్లా వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపయ్య, మరో 25 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలి

రాష్ట్ర నాయకుడు అంజిబాబు

ప్రజాశక్తి-బాపట్ల

వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ళవుతున్నా వీఆర్ఏల సమస్యలు ఒకటి కూడా పరిష్కారానికి నోచుకోలేదని వీఆర్ఏల సంఘం రాష్ట్రనాయకులు కర్నూలు అంజిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం బాపట్ల ఎన్జీఓ హోంలో జరిగిన వీఆర్ఏల జిల్లా మహాసభల ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు జిల్లా వీఆర్ఏల సంఘం కన్వీనర్ గోపయ్య అధ్యక్షతవహించారు. అంజి మాట్లాడుతూ ఉన్న జీవోలోనే కోత పెడుతూ వీఆర్ఏల నుంచి ఒక్క విఆర్ఏతో రూ.19 వేల 5 వందలు రికవరీ చేసుకోవడంతోపాటు జీతాలు పెంచకపోవడంతో వీఆర్ఏలు అప్పుల పాలయ్యారన్నారు. నామినీ వీఆర్ఏగా ఎన్నో యేళ్ళ నుండి పనిచేస్తున్నవారిని రెగ్యులర్ చేయకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయక అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతి కల్పించకపోవడంతో విఆర్ఏలు అయోమయ స్థితిలో ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వారంలోపే గ్రామ సేవకులకు పే స్కేలు, నామినీలను రెగ్యులర్ చేస్తాను, ప్రమోషన్లు కల్పిస్తామని, వారసత్వం కొనసాగిస్తామని నాడు జగన్ ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేర లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కంటే మిన్నగా చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తక్షణమే వీఆర్ఏలకు న్యాయం చేయాలని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటానికి సిద్ధమవౌతామని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. సభలో వీఆర్ఏల రాష్ట్ర నాయకులు బందిగీ, బాజీబాబు, సీఐటీయూ బాపట్ల జిల్లా కార్యదర్శి మంజుదార్ ప్రసంగించారు.



మాట్లాడుతున్న విఆర్ఎల సంఘం రాష్ట్ర నాయకుడు కర్నూలు అంజిబాబు

కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన

హసీనాభాను, ప్రిన్సిపల్, మోడల్ పాఠశాల



హసీనాభాను ను సన్మానిస్తున్న కలెక్టరు(ఫైల్)

ప్రజాశక్తి-దర్శి

తమ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన అందిస్తున్నట్లు మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ హసీనాభాను తెలిపారు. జిల్లా స్థాయిలో దర్శి నియోజక వర్గంలో 8 మంది విద్యార్థులు జగనన్న ఆణి ముత్యాలకు ఎంపికైనట్లు తెలిపారు. అందులో తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఉన్నట్లు ఆమె ప్రజాశక్తికి తెలిపారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎన్‌విఎస్,సౌగంధిక 581 మార్కులు, ఎం సంతోష్‌కుమార్ 576, ఇంటర్‌లో మోడల్ స్కూల్ విద్యార్థినులు సిహెచ్.కీర్తన 982, కెవి.సంధ్య 971, పి. యశ్వంత్ 946 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ హసీనాభాను తెలిపారు. తమ పాఠశాలకు నలుగురు విద్యార్థులు జిల్లాస్థాయిలో జగనన్న ఆణిముత్యాలకు ఎంపిక కావడం తమకెంతో గర్వ ారణమన్నారు. భవిష్యత్‌లోనూ తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు.



సౌగంధిక



సిహెచ్.కీర్తన

సమిష్టి కృషితో ఉత్తమ ఫలితాలు

కెవి రమణారెడ్డి,ప్రిన్సిపాల్, కిజిజి ఉన్నత పాఠశాల



ప్రజాశక్తి-దర్శి

టీమ్ వర్క్, అంకితభావం, సమిష్టి కృషితో తాము ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు కిజిజి ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ కెవి. రమణారెడ్డి తెలిపారు. తమ విద్యార్థి ఊరుబిండి అజయ్ జస్వంత్ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 597/600 మార్కులు సాధించినట్లు ఆయన ప్రజాశక్తితో తెలిపారు. పాఠశాల స్థాపించినప్పటి నుంచి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడానికి క్రమశిక్షణ, అవిరుల కృషితో విద్యాబోధన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ఐఐటి సిలబస్‌ను నేర్పిస్తున్నట్లు తెలిపారు. తక్కువ ఫీజులతో బాల, బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులకు డిజిటల్ తరగతి గదులు ద్వారా విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. ఐఐటి, స్పోకెన్ ఇంగ్లీష్, సెమినార్స్ నిర్వహించిన విద్యార్థులు ర్యాంకులు సాధిం చేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో అత్యాధునిక పద్ధతులలో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపా ధ్యాయుల ద్వారా విద్యబోధన అంది స్తున్నట్లు తెలిపారు. వ్యక్తిత్వ వికాసం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నా మన్నారు. సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షణలో విద్యాబోధన అంది స్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన బోధనే తమ లక్ష్యమని ఆయన తెలిపారు.

గ్రేడ్‌లైనా.. మార్కులైనా..

ఉత్తమ ఫలితాలే..

ఎస్. వెంకటేశ్వరరెడ్డి, కరస్పాండెంట్, శ్రీ ప్రశాంత హైస్కూల్



ప్రకాశం-దర్శి

విద్యారంగంలో గత 30 సంవత్సరాలుగా గ్రేడులైనా, మార్కులైనా తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు శ్రీ ప్రశాంత హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్. వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. క్రమశిక్షణ, అంకితభావం, నైతిక విలువలతో కూడిన విద్యనందిస్తూ అనేక మంది విద్యార్థులను తీర్చి దిద్దినట్లు ఆయన ప్రజాశక్తికి తెలిపారు. తమ పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి దేశ,విదేశాలలో స్థిరపడినట్లు ఆయన పేర్కొన్నారు. తాము ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను సాంస్కృతిక, క్రీడలు, విహార యాత్రలకు తీసుకెళ్లి అన్ని రంగాలలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బాలబాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఉత్తమ బోదన అందించి విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడమే తమ లక్ష్యమని తెలిపారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా 35 ఏళ్ళ క్రితం జన విజ్ఞానవేదిక ఏర్పడినట్లు జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ తెలిపారు. జెవివి సభ్యులుగా చేరి ప్రజా సైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. స్థానిక జవహర్ నర్సింగ్ హోంలో మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. మూ ఢ నమ్మకాలను ప్రారదోలేందుకు నిరంతంర కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈనే పథ్యంలో ప్రజలందరూ జెవివిలో చేరాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి డివిజన్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, జెవివి జిల్లా ప్రధానకార్యదర్శి సిహెచ్. జయప్రకాష్ జెవివి డివిజన్ నాయకులు చలువాది రమేష్,బి. ఆంజనేయులు,ఎస్‌కె. శిలార్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, దేవదాసు,వీరారెడ్డి, రమేష్, చలువాది శ్రీను, పీరుసాహెబ్, అక్బర్, చాట్ల శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సిబిఎస్‌ఇ విధానంలో విద్యాబోధన

వై.అరుణ, ఎస్‌ఒ, కెజిబివి

ప్రజాశక్తి-దర్శి

నూతన విద్యావిధానంలో భాగంగా (సిబిఎస్ఇ) సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సిలబస్‌ను విద్యార్థులకు భోధిస్తున్నట్లు కస్తూరిబా గాంధీ విద్యాలయం ప్రిన్సిపల్ వై. అరుణ తెలిపారు. అరుణ ప్రజాశక్తితో మాట్లాడారు. డిజిటల్ విధానం ద్వారా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడు పథకం రూ. 80 లక్షలతో 8 అదనపు తరగతులు గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు డిజిటల్ ట్యాబ్‌లు అందజేసిటన్లు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్ట్‌లు, బ్యాగులు అంద జేస్తున్నట్లు జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ క్రీడా ప్రాంగణం అభివృద్ధి కోసం రూ. 5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యాబోధనతో పాటు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి మెనూ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అదనంగా రాగిజావ, చిక్కీలు ఇస్తున్నటు తెలిపారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు మెలుకువలు నేర్చుకుని కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన చేస్తున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల పట్ల ఆరోగ్యం, విద్యా భద్రతపై ప్రత్యేకశ్రద్ధ పెట్టామన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమిష్ట కృషితో 10 వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో రాణించేలా శ్రద్ధ తీసు కుంటామన్నారు. టీమ్ వర్క్‌కు సహకరించిన ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా ఆమె అభినందనలు తెలిపారు.

అంకితభావంతో విద్యాబోధన

పి. రాజకేశవరెడ్డి, కరస్పాండెంట్, గౌతమిగ్రామర్ స్కూల్



ప్రజాశక్తి-దర్శి

అనుభవం, అంకితభావంతో తాము విద్యాబోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు గౌతమి గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ పి. రాజకేశవరెడ్డి తెలిపారు. గత 23 సంవత్సరాలుగా ఇంగ్లీష్ బోధిస్తూ తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు గ్రామీణ విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆయన ప్రజాశక్తికి వివరించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ మంచి గుర్తింపును పొందినట్లు తెలిపారు. తమ పాఠశాలలో ఐఐటి కాన్సెప్ట్‌తో డిజిటల్ క్లాసులు, స్పోకెన్ ఇంగ్లీషు, సెమినార్స్ నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దు తున్నట్లు ఆయన తెలిపారు. బాల బాలికలు ప్రత్యేక హాస్టల్ వసతి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. బాలికల కోసం పిఆర్‌కెఆర్ కళాశాలను స్థాపించిన రెండు సంవత్సరాలలోనే ఇంటర్మీడియట్ బైపిసిలో జిల్లా స్థాయిలో 2వ ర్యాంక్ విద్యార్థులు సాధించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదేస్ఫూర్తితో పని చేసి అధ్యాపకులు, విద్యార్థులు సమిష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని రాజకేశవరెడ్డి తెలిపారు.

పాఠశాలల రూపురేఖలు మారాయి

కాకర్ల రఘురామయ్య , మండల విద్యాశాఖాధికారి, దర్శి



ప్రజాశక్తి-దర్శి

నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారినట్లు ఎంఇఒ కాకర్ల రఘురామయ్య తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు ధీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు ఆయన ప్రజాశక్తికి వివరించారు. మండలంలో మొత్తం 85 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నట్లు తెలిపారు. నాడు- నేడు ఫేజ్-1లో 39 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వాటి అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి కావడంతో వాటి రూపురేఖలు మారినట్లు తెలిపారు. నాడు-నేడు ఫేజ్-2లో 37 పాఠశాలలు, 4 అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి రూ. 18.5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆ పాఠశాలల్లో పనులు వివిధ దశల్లోఉన్నట్లు తెలిపారు. నాడు-నేడు ఫేజ్-3లో మిగిలిన 9 పాఠశాలలు, 4 అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగా పనులు చేపడతామన్నారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలో ప్రభుత్వ పాఠశాలలో 66.98 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సరాసరిన 77.39 శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. భవిష్యత్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. జగనన్న ఆణిముత్యాలకు జిల్లా స్థాయిలో 8 మంది ఎంపికైనట్లు తెలిపారు. అందులో దర్శి ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ హసీనాభాను, సిబ్బందికి అభినందలు తెలిపారు.

విద్యార్థినుల భవిష్యత్‌కు బంగారుబాట

టి.వెంకటరెడ్డి, ప్రిన్సిపల్,ఎంఎస్‌ఆర్ బాలికల కళాశాల



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వెంకటరెడ్డి(ఫైల్)

ప్రజాశక్తి-కనిగిరి

విద్యార్థినుల భవిష్యత్‌కు ఎంఎస్‌ఆర్ బాలికల జూనియర్ కళాశాల బంగారుబాట వేస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ టి.వెంకటరెడ్డి తెలిపారు. 1992లో కళాశాలను స్థాపించి అనేక మంది విద్యార్థినులను తీర్చిదిద్దినట్లు ఆయన తెలిపారు. తమ కళాశాలలో చదివిన విద్యార్థినులు డాక్టర్, ఇంజినీర్, ఉపాధ్యాయులుగా రాణిస్తున్నట్లు తెలిపారు. తమ విద్యార్థులకు 15 ప్రతిభా అవార్డులు , 65 బంగారు పతకాలను అందుకున్నట్లు తెలిపారు. 300 మంది నేషనల్ మెరిట్ స్కాలర్‌సిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఐదు ఇన్‌స్పైర్ అవార్డులు పొందినట్లు తెలిపారు. గేమ్స్‌లో వరుసగా 5 సంవత్సరాలు జిల్లా చాంపియన్‌షిప్‌గా తమ విద్యార్థులు నిలిచినట్లు తెలిపారు. ఖోఖోలో తమ విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రరాష్ట్ర ఖోఖో జట్టు కెప్టెన్‌గా ఎంఎస్‌ఆర్ విద్యార్థినులు ఎంపికైనట్లు తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అంకిత భావం కలిగిన అధ్యాపకులతో బోధన అందిస్తున్నట్లు తెలిపారు. తక్కువ ఫీజులతో పేద విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేదల పొట్ట కొడుతున్న మోడీ

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి లోకనాథం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి లోకనాథం తెలిపారు. మండలంలోని మైనంపాడు, సంతనూతలపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో కోట్లాది రూపాయలు కార్పొరేట్లకు కట్టబెడుతూ పేదలకు ఆసరాగా ఉన్న ఉపాధి చట్టానికి మోడీ ప్రభుత్వం నిధులు కుదిస్తుందని విమర్శించారు. రూ.45 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో 30 కోట్ల మంది ప్రజలు ఆధారపడి జీవిస్తున్నా ఉపాధి హామీ చట్టానికి కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే మోడీ ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా ఉపాధి చట్టానికి నిధులు క్రమంగా తగ్గిస్తూ ఈ సంవత్సరం 35 శాతం పైగా నిధులు తగ్గించినట్లు తెలిపారు. మరోవైపు గ్రామీణ పేదలకు ఆహార భద్రతను దూరం చేసే విధంగా ప్రజా పంపిణీ వ్యవస్థను బలహీనపరిచారన్నారు. ప్రపంచ ఆకలి సూచికలో 104వ స్థానానికి భారత్ చేరటం సిగ్గుచేటన్నారు.కోట్లాది టన్నుల ఆహార ధాన్యాలు గోడన్లలో మూలుగుతుంటే వాటిని విడుదల చేసి పేదలకు అందించాల్సింది పోయి, ఆహార భద్రతకు చేటు కలిగించే నిర్ణయాలు చేయడం విచారకరమన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయటకు తెస్తానని, నిత్యవసర ధరలను అరికడతానని చెప్పిన మోడీ మాటలు నీటి మూటలయ్యాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.పెద్దబ్బాయి, సిఐటియు మండల కార్యదర్శి బంకా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కొత్తపట్నం : ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు గత 7 వారాలుగా చేసిన పనికి వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికే అనేక కుటుంబాలకు ప్రభుత్వం కేటాయించిన 100 రోజుల పని పూర్తి అయిందని, ఆ కుటుంబాలకు ఈ ఏడాది ఇక పనులు లభించవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయరావు, యం.బ్రంహయ్య,యస్. రామారావు, జాలయ్య, జి. ఆంజనేయులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పిసిపల్లి

ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఇస్సాక్, బడుగు జనార్ధన్ కోరారు. ధర్నాకు సబంధించిన కరపత్రాలను ప్రభుత్వ వైద్యశాల సెంటర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం బట్టుపల్లె, బుడ్డారెడ్డిపల్లి, వెంగళాయపల్లి నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించి ఉకూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వై.ఏడుకొండలు, నూకతోటి గోపి, మూలె రవీంద్ర, గువ్వల బ్రహ్మానందం, ఎన్.వెంకటరెడ్డి, నేలపాటి రవికుమార్, నారపురెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని తిరుమలగిరి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదవుతున్న గిరిజన విద్యార్థులకు విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంఇఒ ఆంజనేయులు చేతుల మీదుగా పలకలు, నోట్ బుక్స్, స్టీల్ ప్లేట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ సోషల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ విజయకుమార్, వైస్ చైర్మన్ నీరిక్షణమ్మ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయద్రం చేయాలి

ప్రజాశక్తి-టంగుటూరు

భవిష్యత్తుకు గ్యారెంటీకి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్ళి వారిని చైతన్యం చేయడమే లక్ష్యంగా టిడిపి అధిష్టానం చేపట్టిన పల్లెనిద్ర బస్సు యాత్రను జయప్రదం చేయాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. టిడిపి బస్సు యాత్ర ఈనెల 22న టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం చేరు కుంటుందన్నారు. అనంతరం జరగుమల్లి మండలం కె. బిట్రగుంట, నందనవనం గ్రామాలకు బస్సు యాత్ర చేరుకుంటుందని తెలిపారు. అనంతరం ఇటీవల హత్యలకు గురైన సవలం హనుమాయమ్మ, ఉప్పాల అమర్ నాథ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి ధర్నాసి బ్రహ్మానందం, నాయకులు మేడికొండ రవీంద్ర, కసుకుర్తి భాస్కర్ పాల్గొన్నారు.

గిరిజనులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల అటవీ ప్రాంతంలోని కుల్లయ్య కుంట, గౌతమ బుద్దుని కాలనీ, పోతురాజు పెంట గిరిజన గూడేల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరరిజనులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. రక్తహీనతతో బాధ పడే వారికి ఐరన్ మాత్రలు, టానిక్‌లు, ప్రొటిన్ పౌడర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లిక, రమణమ్మ, శ్రావణి, నాగలక్ష్మి, లక్ష్మిదేవి, పిల్లి ఆవులయ్య, నలగాటి వెంకట్రామయ్య నాయుడు పాల్గొన్నారు

'జగనన్న సురక్ష' పై శిక్షణ

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అమ్మనబ్రోలు, తిమ్మ సముద్రం,కనపర్తి, చదలవాడ, చీర్వానుప్పలపాడు, ఉప్పుగుండూరు, నిడమానూరు, కొత్తకోట సచివాలయాల వాలంటీర్లు ,సచివాలయ సిబ్బంది, కార్యదర్శులకు జగనన్న సురక్ష పథకంపై మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి నలమలపు అంజమ్మ, ఎంపిడిఒ జయమణి జగనన్న సురక్ష పథకం విధి విధానాలపై అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లు సకాలంలో ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దారు జయలక్ష్మి, ఇఒఆర్‌డి కుమారి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల శుభ్రతపై దృష్టి : కమిషనర్

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

రానున్న వర్షాకాలం దృష్ట్యా నగరంలో డ్రెయినేజీల శుభ్రతపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు సూచించారు.పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం స్థానిక 49వ డివిజన్ సత్యనారాయణ పురం సచివాలయం పరిధిలో పర్యటించారు. గుంటూరు రోడ్డులో కాల్వలో పూడిక తీత పనులను పరిశీలించారు. కాల్వల్లో ఎక్కడా వ్యర్థాలు నిల్వలేకుండా చూడాలని, నీటి పారుదలకు ఆటంకం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. గుంటూరు రోడ్డులోని అన్నీ హోటల్స్, వ్యాపారస్తులు ఎవరు కూడా వారికి సంబంధించిన చెత్తను డ్రెయినేజీలో వేయకుండా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి మూడు బుట్టల విధానంలో చెత్తను సేకరించి క్లాప్ ఆటోలకు అందజేయాలని చెప్పారు. ఈసందర్భంగా సచివాలయం పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనుల గురించి స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట స్థానిక కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మిరియం శ్రీను, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్నఉ కమిషనర్

వైసిపిలో భగ్గుమన్న అసమ్మతి సెగ

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గంలో అసమ్మతి సెగ భగ్గుమంది. జగనన్నకు జై.. వరికూటికి నై అంటూ వైసిపి కార్యకర్తలు, నాయకులు నినాదాలు చేశారు. స్థానిక పొదిలి రోడ్డులోని గుడిపల్లి చందు కల్యాణ మండపంలో వైసిపి పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నియోజక వర్గ స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, కొండపి సొసైటీ అధ్యక్షుడు బొక్కిసం ఉపేంద్రచౌదరి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య , రాష్ట్ర వైద్య విభాగం అద్యక్షులు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదాసి వెంకయ్య మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యమని తెలిపారు. వైసిపి వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొండపి నియోజక వర్గంలో కొందరు పార్టీకి ద్రోహం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డపాట అరుణమ్మ, యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ట రామారావు, పొన్నలూరు ఎంపిపి కొండాబత్తిన మాధవరావు, నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మాదాసి వెంకయ్య

వికలాంగుల ధర్నా

యర్రగొండపాలెం : వికలాంగుల పెన్షను రూ. ఆరు వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య డిమాండ్ చేశారు. వికలాంగుల పింఛను పింఛనును పెంచాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ ఉప్పలపాటి విజయభాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు పోలేపల్లి పెద్ద పాలంకయ్య, నాయకులు కోటేశ్వరావు, శ్రీనివాసరావు, నాగయ్య, ఖాసిం, శ్రీను, చంటి, వెంకట నరసమ్మ, తిరుపతమ్మ, బాదరయ్య పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహానికి వినతి

కొండపి : కాంట్రాక్టు అధ్యాపకులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ వైఎస్ఆర్ విగ్రహానికి మంగళవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులు మాట్లాడుతూ 2019 ఎన్నికలల్లో మేనిపెస్టోలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హత కలిగిన కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యుల్ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ హామీని అమలు చేయాలని కోరారు.

అమృత వర్షిణికి కాంస్య పతకం

పెద్దదోర్నాల : నేషనల్ యోగా బలంపియాడ్ 2023 పోటీలు ఈ నెల 18 నుంచి 20 వరకూ భోపాల్, మధ్యప్రదేశ్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో గిరిజన సంక్షేమ శాఖ ఇండియా తరుపున పెద్దదోర్నాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని అమృత వర్షిణి ప్రాతినిధ్యం వహించింది. బాలికల సెకండరీ స్థాయిలో కాంస్య పతకాన్ని సాధించింది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు మండలం కరవది గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పిహెచ్‌సిల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. పిహెచ్‌సిలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మీ, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖపై బురద చల్లొద్దు

- బాలుని హత్య విషయమై సకాలంలోనే చర్యలు
- ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలంలోని రాజోలు గ్రామంలో ఇటీవల జరిగిన బాలుని హత్య సంఘటనను ఉద్దేశించి కొంతమంది పోలీస్ శాఖపై చేస్తున్న ఆరోపణల గురించి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వివరణ ఇచ్చారు. ఉదయం 7 గంటలకే టీవీలలో బ్రేకింగ్ న్యూస్ వస్తున్నా పోలీస్ అధికారులు స్పందించలేదని, గుంటూరు జిజిహెచ్ హాస్పిటల్‌కి బాధితుడు వెళ్లిన తరువాతనే పోలీస్ అధికారులు స్పందించారని ఆరోపిస్తున్నారని, ఇది పూర్తిగా అవాస్తవం అని ఎస్పి అన్నారు. జరిగిన ఘటనను గురించిన సమాచారం తెలిసిన వెంటనే చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ స్పందించి ఉదయం 6 గంటల లోపు బాధితుడు ఉన్న చెరుకుపల్లిలోని హాస్పటల్‌కు వెళ్లాడని తెలిపారు. బాధితుడిని అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జిజిహెచ్‌కు తరలించేందుకు వెంటనే ఎస్ఐ స్వయంగా అంబులెన్స్‌ను పిలిపించి బాధితుడిని గుంటూరు జిజిహెచ్‌కు తరలించి అంబులెన్స్‌తో పాటు చెరుకుపల్లి ఎస్ఐ కూడా గుంటూరు జిజిహెచ్‌కు చేరుకున్నారన్నారు. బాధితుడు గుంటూరు హాస్పటల్‌కు చేరటానికి ముందుగానే రేపల్లె రూరల్ సిఐ హాస్పిటల్ దగ్గర



ఉండి బాధితుడిని హాస్పటల్‌లో జాయిన్ చేయించారని తెలిపారు. ముద్దాయిలు గంజాయి మత్తులో నేరం చేశారనడం అవాస్తవమన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 42 గంజాయి కేసులు నమోదు చేశామని, వాటిలో 142 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. జిల్లాలో గంజాయి క్రయ విక్రయాలకు పాల్పడు తున్న నలుగురిపై పిడి చట్టం ప్రయోగించినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో గంజాయి క్రయ విక్రయాలను పూర్తి స్థాయిలో నిర్మూలించా మన్నారు. కనుక గంజాయి మత్తులో ముద్దాయిలు నేరం చేశారనే నిరాధార ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. గతంలో ముద్దాయికి మృతుని కుటుంబానికి మధ్యనున్న వ్యక్తిగత వివాదం కారణంగా ఈ ఘటన జరిగిందన్నారు. ముద్దాయిలు పోలీస్ స్టేషన్ కు వెళ్లి కౌంటర్ కేసు పెట్టడానికి ప్రయత్నించారని అభియోగం చేశారని, ఇది పూర్తిగా అవాస్తవమని అన్నారు. మృతుని తల్లి నుంచి ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి కేవలం 24 గంటలలోనే ముద్దాయిలను పోలీస్ కస్టడీలోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. నేర విచారణ నిష్పక్షపాతంగా జరగడానికి ఫిర్యాది సూచన మేరకు వేమూరు సిఐని ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించి దర్యాప్తు జరిపించినట్లు తెలిపారు. నేర స్థలాన్ని క్లూస్ టీంతో క్షుణ్ణంగా పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో భౌతిక సాక్ష్యాధారాలను సేకరించామని అన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు వారి స్వలాభం కోసం పోలీస్ శాఖపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కేసు దర్యాప్తు మొత్తం పోలీస్ శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరుపుతున్నామని అన్నారు. సేకరించిన ప్రతి ఒక్క ఆధారాన్ని కోర్టు ముందు వుంచి ముద్దాయిలకు సరైన శిక్ష పడే విధంగా వ్యవహరిస్తున్నామన్నారు. కేసు దర్యాప్తు గురించి ఎవరు కూడా అపోహలు పెట్టుకోవద్దని జిల్లా ఎస్పీ అన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించాలి

ప్రజాశక్తి-అద్దంకి

రైతు వ్యతిరేక జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. మంగళవారం అద్దంకి పట్టణంలోని పోతురాజుగండిలోగల నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ధర్మవరం, నాగులపాడు, వెంకటాపురం, కలవకూరు గ్రామాల టిడిపి నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు నారా చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు కార్యక్రమం, ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన ఎన్నో రకాల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వాటి పరిష్కారమే లక్ష్యంగా మహానాడు వేదికగా టిడిపి మినీ మేనిఫెస్టో



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

రూపొందించి ప్రకటించినట్లు తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రజలను ఉన్నత స్థితికి తీసుకెళ్లే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు ఆలోచన విధానం ఉందని, అందులో భాగంగానే మేనిఫెస్టో తయారు చేసినట్లు తెలిపారు. నేడు రాష్ట్రంలో రైతన్నల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని పండించిన పంటలు చేతికందక పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీరక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

పిఎసిఎస్ కంప్యూటరీకరణకు చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) కంప్యూటరీ కరణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జిల్లా స్థాయి సహకార సంఘాల నిర్వహణ, పర్యవేక్షణ కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా రైతులకు అందించడమే ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ చెప్పారు. నగదు బదిలీ, రాయితీలు, బీమా వర్తింపజేసే కార్యక్రమాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతాయన్నారు. ఆయా సంఘాలలో నేటికీ ఆధునికీకరణ సేవలు అందుబాటులోకి రాకపోవడం ఏమిటని ఆరా తీశారు. పిడిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 68 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు నడుస్తున్నాయన్నారు. ఈ సంఘాలలో 42 వేలమంది రైతులు సభ్యత్వం కలిగిఉన్నట్లు వివరించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటరీకరణ చేయాలన్నారు. ప్రభుత్వం నిబంధనలను అనుసరించి ఆప్కాబ్ ద్వారా కంప్యూటర్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. తదుపరి వాటి నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారదర్శకంగా రైతులకు అన్ని సేవలు అందజేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆయన మార్గ నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి రామారావు, పిడిసిసిబి సీఈవో వై ప్రకాష్, నాబార్డ్ డిడిఎం శరత్, అప్కాబ్ డిపిడిఎం టిపివి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

రుణ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలంలో ఆయా బ్యాంక్‌ల ద్వారా డ్వాక్రా గ్రూప్‌లో ఉన్న మహిళా సభ్యులకు మంగళవారం రుణమేళా జరిగింది. భట్టిప్రోలు, వెల్లటూరు, పెదపులివర్రు, పల్లెకోన గ్రామాలలో ఉన్న భారతీయ స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ పరిధిలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పేర్లు నమోదు చేసుకున్నారు. ఆయా బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో ఉపాధికి అవసరమైన యూనిట్లపై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపిపి, డివి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, ఎంపిడిఓ చంద్రశేఖర్, మండల సమాఖ్య అధ్యక్షులు కర్రా స్వరాజ్యం, ఏపిఎం శ్రీమన్నారాయణ, యానిమేటర్లు ఉన్నారు.

మేదరమెట్ల: మండలంలోని ఎనిమిది సచివాలయాల పరిధిలో ఉన్న గ్రూప్ సభ్యులకు వివిధ రకాలకు సంబంధించిన పిఎంఈజీపి, పిఎంఈఎంఈకు సంబంధించిన లబ్ధిదారుల నుంచి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు. ముందుగా 95 స్కీముల గురించి సబ్సిడీ గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డిఆర్పి రవీంద్ర, వైఎస్ఆర్



భట్టిప్రోలులో మహిళల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

కెపి, డిఆర్డిఏ సమన్వయకర్త కె రవికుమార్, 8 సచివాలయాలకు సంబంధించిన సిబ్బంది, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఏపిఎం బి అనురాధ, సిసిలు సాంబయ్య, మస్తాన్, గ్రామాల వివో లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొల్లూరు: స్వయం సహాయక సంఘ సభ్యులకు, నిరుద్యోగ యువతీ యువకులకు సబ్సిడీ రుణాలు ప్రభుత్వం అందిస్తుందని ఎంపీడీవో ఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సబ్సిడీ రుణాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిఎం రాములు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఓసీలకు సబ్సిడీ రుణాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. త్వరగా యానిమేటర్ల ద్వారా యూనిట్ వివరాలు తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి-కర్లపాలెం: ఆంధ్ర రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకొస్తున్న మార్పులు భవిష్యత్ తరాలకు ఎంతో మేలని గణపవరం పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాగిత మోజస్ తెలిపారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ దేవరకొండ అంకమ్మతో కలిసి పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన నగదు, ప్రశంసా పత్రం, మెడల్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్పంచ్ అంకమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టీ కొండలు ఆదినారాయణ ఏడుకొండలు అజయ్ గ్రామపెద్ద దేవరకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇసెట్ -2023 పరీక్షలు

ప్రజాశక్తి-వేటపాలెం: ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షలు విజయవంతంగా ముగిశాయని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ నుంచి బి టెక్ రెండో సంవత్సరంలో చేరేందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో, జెఎన్‌టియు, కాకినాడ వారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ - 2023 కళాశాలలోని టిసిఎస్ ఐయాన్ సెంటర్‌లో ప్రధాన అధ్యాపకులు మొయిదు వేణుగోపాలరావు పేర్కొన్నారు. మొదటి షిఫ్టులో 170 మందికి గాను 156 మంది, సాయంత్రం షిఫ్టులో 271 మందికి 256 మంది మొత్తం 441 మందికి గాను 412 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలకు జి కళాధర్ పరిశీలకులుగా విచ్చేశారు.



కొల్లవారిపాలెంలో డ్రైనేజీ పరిశీలిస్తున్న ఆమంచి

కొల్లవారిపాలెంలో 'గడప గడపకూ'

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం కొల్లవారిపాలెం గ్రామ సచివాలయంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైసిపి పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొల్లవారిపాలెం మంచినీటి చెరువును పరిశీలించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, మరియు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోలా సరస్వతి, ఎంపీటీసీ ఏల్చూరి చంద్రమేరి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, జంగల ఆనంద్ కుమార్, బిల్లా అశోక్, మాజీ ఎంపీపీ కోట హరిబాబు, కోలా రామకృష్ణ, కుక్కపల్లి నాగేశ్వరావు, పర్చూర్ మాజీ వైస్ సర్పంచ్ గాదె సురేష్, ఉప్పలపాటి అనిల్, అడపా సుధాకర్‌రెడ్డి, దగ్గుబాటి రామకృష్ణ, గోరంట్ల శివ కుమారి, నాగమణి, ముప్పాళ్ల రాఘవయ్య, గోరంట్ల నాగేశ్వరావు, వైసిపి పర్చూరు నాయకులు పాల్గొన్నారు.

హేతువాద సంఘం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-వేటపాలెం

తాడిత పీడిత ప్రజల కోసం నిరంతరం హేతు వాద సంఘం పాటుపడుతుందని వక్తలు పేర్కొన్నారు. మంగళ వారం మండల పరిధిలోని పలుపోలు వారి వీధిలో పల్లపోలు సాంబయ్య ఇంటి వద్ద హేతువాద సంఘ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి పల్లపోలు సాంబయ్య 97వ జయంతి పురస్కరించుకొని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పల్లపోలు నాగ మనోహర లోహియా, మండూరి వెంకయ్య, ఉమ్మారెడ్డి వెంకయ్య, రామిశెట్టి సాయిశ్రీ బొమ్మలపెంట వెంకటేశ్వర్లు, పసుపులేటి వసంతకుమారి, పర్వతరెడ్డి, రమాదేవి, రమేష్ బాబు, అంజనాదేవి తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ప్రారంభ దృశ్యం



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎంపీ మోపిదేవి

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ప్రజాశక్తి-రేపల్లె

పేదల ఆరోగ్య అవసరాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు అన్నారు. పట్టణానికి చెందిన పొన్నూరు మురళీధర్‌రావు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అతనికి చికిత్స చేసేందుకు వైదులు రూ.11 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఈ విషయాన్ని వైసీపీ నాయకులకు తెలపడంతో వారు ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకెళ్లారు. మోపిదేవి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి రూ.11 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంజూరు చేయించి, బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తర్లుపాడు
పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పూతలపాడు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి, రామ సుబ్బారెడ్డి, పోతలపాడు సర్పంచి గాయం శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు కుర్మా రాయణి సత్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-కురిచేడు
విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ఆదిశగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్ తెలిపారు. కురిచేడులో ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ అంబేద్కర్ పాఠశాలను దర్శి ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పాఠశాల ప్రిన్సిపల్ బలరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గుంటూరు జిల్లాలో ఓ సాంఘిక సంక్షేమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు, ఐఆర్ఎస్‌లుగా ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. జిల్లాలోనే మొట్ట మొదటిసారిగా రూ. 21.70 కోట్లతో ఈ పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షురాలు బెల్లం కోటేశ్వరమ్మ, సాంఘిక సంక్షేమ డిసిఒ జయ, కనిగిరి ఆర్‌డిఒ విజయ్‌కుమార్, తహశీల్దారు జ్వాలా నరసింహారావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వసంతకుమార్, ఎస్‌ఐ దేవకుమార్, కురిచేడు సర్పంచి కె.క్రిష్ణయ్య, నాయకులు బెల్లం చంద్రశేఖర్‌రావు, యేరువ సుబ్బారెడ్డి, యేరువ పిచ్చిరెడ్డి, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మద్దాళికి అవార్డు

చీమకుర్తి : అభయకళారాధన అధ్యక్షుడు మద్దాళిమాధవరావుకు హైదరాబాదుకు చెందిన శ్రీరాజ్ డాన్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ వారు లైఫ్‌టైమ్ ఎచ్చివ్‌మెంట్ అవార్డు అందజేశారు. ఫాదర్స్‌డే సంధర్భంగా హైదరాబాదు లోని తెలంగాణా పరిషత్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు అందజేశారు.